# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 101 | పేజీలు: 4 | వెల: 4/- | సోమవారం 04, నవంబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




## జమిలి ఎన్నికలు వద్దు.. టీవీకే తీర్మానం

**చెన్నై, నవంబరు 3 (నమస్తే ఉదయం):** జమిలి ఎన్నికలకు వ్యతిరేకంగా తమిళ సినీనటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రికళగం (టీవీకే) కార్యనిర్వాహక మండలి సమావేశంలో తీర్మానం చేశారు. పాలకపక్షం డీఎంకే ఏళ్ల తరబడి చేస్తున్న నీట్ వ్యతిరేక ప్రతిపాదనను కూడా ఈ సమావేశంలో ఓ తీర్మానంగా చేసి ఆమోదించారు. సామాజిక న్యాయంకోసం రాష్ట్రంలో కులాలవారీ జనగణన జరపాల్సిన అవసరం ఉందని మరొక తీర్మానం చేశారు.

## బీసీ రిజర్వేషన్ల కోసం
# డెడికేషన్ కమిషన్ ఏర్పాటు

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం



**హైదరాబాద్,నవంబర్3(నమస్తే ఉదయం):** స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్లకు న్యాయపరమైన చిక్కులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు.

సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల నేపథ్యంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ తో పాటు ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి తన నివాసంలో సమాలోచనలు జరిపారు. రాష్ట్రంలో ఈనెల 6వ తేదీ నుంచి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి మరియు కుల సర్వే ప్రారంభించనుంది. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా ఉండేందుకు, న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేందుకు కోర్టుతీర్పులను తప్పకుండా అనుసరించాలని అభిప్రాయ పడ్డారు.

అందరి అభిప్రాయాల మేరకు వెంటనే బీసీ డెడికేటేడ్ కమిషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులను రేపటిలోగా జారీ చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కుల గణన, స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో ఇటీవల హైకోర్టు లేవనెత్తిన అంశాలను ప్రభుత్వం పున: సమీక్షించింది. అందరి ఏకాభిప్రాయం మేరకు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వానికి ఎలాంటి బేషజాలు లేవని, స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలోనూ పారదర్శకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు.

## రేవంత్.. ఒక్కరోజైనా వడ్ల కొనుగోలుపై
# రివ్యూ చేశావా?

- రైతుల ఓట్లు కావాలి కానీ, రైతుల వడ్లు పట్టవ రేవంత్‌రెడ్డి?
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రైతుల ఓట్లు కావాలి.. రైతుల వడ్లు పట్టవు
- నెలరోజులైన వడ్లు కొనుగోలు చేయడం లేదు
- రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు రైతుల దగ్గరికి వెళ్లి మద్దతు ధర వస్తుందా లేదా అని ఎందుకు అడగట్లేదు?
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల ఉసురుపోసుకుంటుండు.
- 15, 20 రోజులుగా రైతులు ఇంటికి వెళ్లకుండా.. వడ్ల కల్లాల దగ్గరే కావాలి కాస్తున్నారు
- సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం బద్దిపడగ గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మాజీ మంత్రి హరీశ్‌రావు



**సిద్దిపేట,నవంబర్3(నమస్తే ఉదయం):** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు కనీస మద్దతు దక్కడం లేదు. కేసీఆర్ హయాంలో వడ్లు కల్లాలకు రాకముందే సంచులు పంపించి, మిల్లులు టైయ్యప్ చేపించి, ట్రాన్స్ పోర్ట్ ఏర్పాటు చేసి మరీ రైతుల నుంచి వడ్లు కొనుగోలు చేశారు. కానీ, రేవంత్ సర్కార్ నెలరోజులైన వడ్లు కొనుగోలు చేయడం లేదు.

కోతులు, పందికొక్కులు వడ్లను నాశనం చేస్తున్నాయి. రైతులంతా ఇంటికి వెళ్లకుండా కల్లాల కాడా కావాలి కాస్తున్నారు. ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి రైతుల మద్దతు కోరాడు. కానీ ఇప్పుడు వడ్లకు కనీస మద్దతు ధర ఇవ్వడం లేదు.

జగిత్యాల జిల్లా, మహబూబాబాద్, సూర్యాపేట, రాజన్నసిరిసిల్లలో రైతులంతా రోడ్కెక్కి ధర్నాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులను రోడ్డుపై పడేశారు.. రైతుల ఓట్లు కావాలి కానీ, రైతుల వడ్లు పట్టవ రేవంత్‌రెడ్డి. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఒక్కరోజైన వడ్ల కొనుగోలుపై రివ్యూ చేపట్టావా? ఓట్లప్పుడు ఊరురా తిరిగిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు ఎందుకు రైతుల దగ్గరికి వెళ్లట్లేదు? కొనుగోలు కేంద్రాల్లో రైతుల బాధలు, కష్టాలు తెలుసుకో వడ్ల కొనుగోలు జరుగుంతా లేదా అని రేవంత్‌రెడ్డి గానీ, మంత్రులు గానీ ఏ ఒక్కరు పట్టించుకోవట్లేదు. కేసీఆర్ రైతుబందు రెండు సార్లు ఇస్తే.. మూడుసార్లు ఇవ్వాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేసిండు. కానీ ఆయన ముఖ్యమంత్రి అయ్యాక ఒక్కసారి కూడా రైతుబందు ఇవ్వలేదు. రేవంత్‌రెడ్డి రైతుల ఉసురుపోసుకుంటుండు. రాష్ట్రంలో మక్కలు కొనే దిక్కులేదు. కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటు చేయలేదు..

7,521లకు కొనుగోలు చేయాల్సిన పత్తి.. కేవలం 5000లకు రైతులు అమ్ముకుంటున్నారు. పత్తికి మద్దతు ధర లేకపాయే.. మక్కల కొనుగోలు కేంద్రాలు లేవు.. వడ్లు 1800లకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులు పంట పండించుకునేందుకు కష్టపడాలి. పండించిన పంటను కూడా అమ్ముకునేందుకు కష్టపడాలా ? ఇదేనా రేవంత్ రెడ్డి నువ్వు రైతులకు చేసే సేవ.?

రాష్ట్రంలో ఇంకా 22లక్షల మందికి రుణమాఫీ కాలేదు. వంద కారణాలు చూపించి చాలా మందికి రుణమాఫీ చేయలేదు. కరోనా మహమ్మారి సమయంలో కూడా కేసీఆర్, రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో వేశారు. వడ్ల కొనుగోలు కేంద్రాలకు ముఖ్యమంత్రి రాడు. మంత్రులు రారు. కలెక్టర్లు రారు. ఆదిలాబాద్ జిల్లాలో సోయాబీన్ కొనుగోలు చేసిన ప్రభుత్వం రెండు నెలలైనా డబ్బులు ఇవ్వలేదు. దీంతో చాలా మంది రైతులు దళారులకు అమ్ముకుంటున్నారు.సిద్దిపేట జిల్లాలో 3.60 లక్షల ఎకరాల్లో వానకాలం వరి సాగు అయ్యింది. 9 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు పండుతాయి. కానీ ఇప్పటి వరకు అధికారులు వెయ్యి మెట్రిక్ టన్నుల వడ్లు కూడా కొనలేదు. కేసీఆర్ హయాంలో మంత్రులు, ఎమ్మెల్యేల జీతాలు ఆపి మరీ.. రైతులకు రైతుబందు డబ్బులు వేశారు. 11 సార్లు కేసీఆర్ 72,815కోట్లు రైతుబంధు డబ్బులు వేశారు.

రైతులకు గన్ని బ్యాగులు, టార్పాలిన్ కవర్లు, ఇచ్చే తెలివి కూడా రేవంత్ రెడ్డికి లేదు. ముఖ్యమంత్రి, మంత్రులు హైదరాబాద్‌ను వదిలి, కొనుగోలు కేంద్రాల్లోకి వెళ్లి వడ్ల కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలి. రైతులకు మద్దతు ధర ఇవ్వాలి. 500 బోనస్ ఇవ్వాలి. లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు చేపట్టి ప్రభుత్వాన్ని నిలదీస్తాం.

## తెలంగాణలో చేప కథ
# ముగిసిన అధ్యాయమేనా?

- నడుమంత్రపు పాలనలో నెర్రలు భారిన నీలి విప్లవం
- మత్స్యకారుల జీవితాల్లో మట్టికొట్టిన రేవంత్ సర్కార్
- 'ఎక్స్' వేదికగా రేవంత్ సర్కారుపై బీ ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌కేటీఆర్ నిప్పులు



**హైదరాబాద్, (నమస్తే ఉదయం):** 20 వేల టన్నుల మత్స్యసంపద దిగుబడిపై కక్షగట్టిన ఇందిరమ్మ రాజ్యం. ప్రభుత్వం మారితే పథకాల పేర్లు మారుతాయి కానీ, కాంగ్రెస్ పాలనలో పథకాలే నామరూపాలు లేకుండపాయే. మూసి మురికిలో కోట్లు కుమ్మరించడంపై ఉన్న ప్రేమ – జలాశయాల్లో జలపుష్పాలను వదలడంలో లేకపాయే. మూసి పేరుతో పేదల ఇల్లు కూల్చి రాక్షస ఆనందం పొందే నీకు – ఉపాధి లేక బోసిపోయిన బెస్త వాడలపై లేకపాయే. హైడ్రా పేరుతో హైద్రాబాద్ ఖ్యాతిని మంటగలుపుతున్న నీకు – ముదిరాజ్ సోదరుల దీన స్థితిపై లేకపాయే. మత్స్యకారుల జీవితాల్లో మట్టికొట్టిన రేవంత్ సర్కార్.

తెలంగాణ లో చేప కథ ముగిసిన అధ్యాయమేనా? నడుమంత్రపు పాలనలో నెర్రలు భారిన నీలి విప్లవం. 20 వేల టన్నుల మత్స్యసంపద దిగుబడిపై కక్షగట్టిన ఇందిరమ్మ రాజ్యం. ప్రభుత్వం మారితే పథకాల పేర్లు మారుతాయి కానీ కాంగ్రెస్ పాలనలో పథకాలే నామరూపాలు లేకుండపాయే. మూసి మురికిలో కోట్లు కుమ్మరించడంపై ఉన్న ప్రేమ – జలాశయాల్లో జలపుష్పాలను వదలడంలో లేకపాయే. మూసి పేరుతో పేదల ఇల్లు కూల్చి రాక్షస ఆనందం పొందే నీకు –ఉపాధి లేక బోసిపోయిన బెస్త వాడలపై లేకపాయే.

## యాదాద్రికి కార్తీక శోభ

**యాదాద్రి, (నమస్తే ఉదయం):** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కార్తీకమాసంలో వచ్చిన తొలి ఆదివారం కావడంతో స్వామివారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి భక్తు లు తరలివచ్చారు. కొద్ది రోజులుగా ఆలయంలో భక్తు ల రద్దీ సాధారణంగా ఉండగా ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. తెల్లవారు జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రో క్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.




ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం, నిత్యబ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణపుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి, అమ్మవార్ల శీఘ్ర దర్శనం 4 గంటలు, అతిశీఘ్రదర్శనం 3 గంటల సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా ఆదివారం రూ.60,82,772 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

# కులగణనకు
# భారీగా కసరత్తు

### సమగ్ర వివరాలు సేకరణ దిశగా అడుగులు - ప్రజలు సహకరిస్తే సజావుగా సర్వే

**హైదరాబాద్,నవంబర్3(నమస్తే ఉదయం):** నవంబర్ 6వ తేదీ నుంచి ప్రారంభమయ్యే బిసి కులగణన సర్వే ఈనెల 30వ తేదీలోపు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే 85 వేల మంది ఎన్యూమరేటర్లు ప్రజల నుంచి సమాచారాన్ని సేకరించనున్నారు. ప్రతి 10 మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్‌ను ప్రభుత్వం నియమించింది. ఇక గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు సైతం ఈ కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు. వీరితో పాటు పాఠశాల ఉపాధ్యాయులను కూడా ఈ సర్వేకు వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాల వేళలు అయిపోయిన తరువాత ఒక్కో ఉపాధ్యాయుడు ప్రతిరోజు 5 నుంచి 7 ఇళ్లను సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలోనే ఎన్యుమరేటర్‌లకు, సూపర్‌వైజర్‌లకు, ఇతర సిబ్బందికి ఆకర్శణీయమైన వేతనాన్ని చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే సర్వే జరిగే ప్రతి గ్రామంలో ముందుగా డప్పు చాటింపు వేయించాలని, సర్వే నిర్వహించే సమయంలో కలెక్టర్‌లు క్షేత్రస్థాయిలో తిరిగి తనిఖీలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.



గ్రేటర్ హైదరాబద్ పరిధిలో 21 వేల మంది ఎన్యుమరేటర్‌లను ప్రభుత్వం వినియోగించుకుంటుంది.

రాష్ట్రంలో కులగణనను చాలా పకడ్బందీగా నిర్వహిస్తామని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ కూడా స్పష్టం చేశారు. ఈ కులగణన సందర్భంగా తప్పుడు సమాచారం ఇచ్చినా.. తప్పుడు సమాచారం నమోదు చేసినా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కులగణన సర్వే సందర్భంగా కులం పేరు తప్పుగా నమోదు చేయించుకుంటే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. కులగణన బృహత్తర కార్యక్రమమని, ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాటి కేసీఆర్ సారథ్యంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ఎక్కడ ఉందో తెలియదని అన్నారు. ఆ వివరాలు ఏమయ్యాయో ఆ దేవుడికే తెలుసునన్నారు. అయితే ఆనాటి వివరాలు తెలియవని అంటే సరిపోదు. అవి ఏమయ్యాయో తెలుసుకునే ప్రయత్నం చేయాలి. సర్వేలో కేవలం బిసి జనాభా గురించి కాకుండా రాష్ట్ర సమగ్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని అన్ని వివరాలు సేకరిస్తే మంచిది. ఈ గణన ద్వారా బీసీలతో పాటు అన్ని కులాల జనాభా లెక్కలు, వారి ఆర్థిక స్థితిగతులు తెలుస్తాయి. సర్వే సక్రమంగా జరిగేలా చూడాలి. 80వేల నుంచి 90వేల మంది ఎన్యుమరేటర్లు జనగణనలో పాల్గొంటారు. ఎవరూ దీన్ని రాజకీయం చేయొద్దు. అపోహలు, ఆటంకాలు సృష్టించడం మంచిది కాదని నిరంజన్ అన్నారు. సర్వేకు వచ్చే సిబ్బందికి సమగ్రమైన వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ కులగణన అనేది ఎక్స్ రే మాత్రమే కాదని.. హెల్త్ చెకప్ లాంటిందని కూడా సీఎం రేవంత్ అభివర్ణించారు. అందువల్ల అసమగ్రతకు తావు లేకుండా సాగాల్సి ఉంటుంది.

# మమ్మల్ని జైల్లో పెట్టడానికి భయపడుతున్నారా?

- రేవంత్ రెడ్డికి ముందుంది ముసళ్ళ పండగ
- మమ్మల్ని జైల్లో పెట్టడానికి భయపడుతున్నారా?
- ఒవైసీ గురించి ముస్లింలకు తెలుసు
- విద్యుత్ కమీషన్ చైర్మన్ విచారణ చేయకుండా నివేదిక ఎట్లా ఇస్తారు?
- సీసీఐ నుండి కిలో పత్తి కొనలేదు
- కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు లేవు
- పత్తి రైతులకు కాంగ్రెస్,బీజేపీ పార్టీల ద్రోహం
- సీఎం,డిప్యూటీ సీఎం, మంత్రులు ఇతర రాష్ట్రాల్లో ఎంజాయ్ చేస్తున్నారు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

**హైదరాబాద్,నవంబర్3(నమస్తే ఉదయం):** తెలంగాణలో రైతాంగం పరిస్థితి రోజురోజుకు దిగజారుతోంది. దొంగ లెక్కలతో రుణమాఫీ చేశామని ప్రభుత్వం అంటోంది. రుణ మాఫీని దేశం మొత్తం చెప్పుకునే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోంది. రైతు భరోసా ఇవ్వమని రైతులు మొత్తుకుంటున్నారు. రైతులు పండించిన పత్తిని ప్రభుత్వం కొనడం లేదు. వరి ధాన్యం కేంద్రాలు లేకపోవడంతో రైతులు ధాన్యం కల్లాల్లో ఆరబోసుకుంటున్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు మిల్లర్లతో చర్చలు చేయలేదు. వరి ధాన్యం,పత్తి కొనుగోళ్లపై సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు సమీక్ష చేయలేదు.

కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు లేవు. సన్న వరి ధాన్యానికి 500 రూపాయలు బోనస్ ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. రైతులు రోడ్లపై వరి ధాన్యం ఆరబెడుతున్నారు. పత్తి రైతులకు కాంగ్రెస్,బీజేపీ పార్టీలు ద్రోహం చేశాయి. ప్రభుత్వం సీసీఐ నుండి కిలో పత్తి కొనలేదు. సీఎం,డిప్యూటీ సీఎం, మంత్రులు ఇతర రాష్ట్రాల్లో ఎంజాయ్ చేస్తున్నారు. పక్క రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు తెలంగాణ పత్తి పంటకు కేంద్రం 7,000 మద్దతు ధర ప్రకటించింది. గుజరాత్‌లో పత్తి పంటకు 8,000 మద్దతు ధర ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చింది గ్రామీణ ప్రాంతాలు. ఫోర్త్ సిటీ,ఫిఫ్త్ సిటీ అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అడ్డగోలుగా విద్యుత్కోతలు ఉన్నాయి. 2014 కు ముందు ఉన్న పరిస్థితులు తెలంగాణలో ఉన్నాయి నల్గొండ జిల్లా ఫ్లోరైడ్ బారిన పడే పరిస్థితి వచ్చింది. రైతుల ట్రాన్స్ఫార్మర్స్ కాలిపోతే పట్టించుకోవడం లేదు.

రేవంత్ రెడ్డి మోదీని తిట్టినా బీజేపీ నేతలు సైలెంట్‌గా ఉన్నారు. రేవంత్ రెడ్డిని విమర్శించే మొగోడు బీజేపీలో లేడు. రైతు రుణమాఫీ అందరికీ కాలేదని వ్యవసాయ శాఖామంత్రి అంటున్నారు. రెండు లక్షల మందికి రుణమాఫీ అయిందని సీఎం రేవంత్ రెడ్డి దబాయిస్తున్నారు. అరెస్టులతో ఉద్యమాన్ని రేవంత్ రెడ్డి ఆపలేరు రేవంత్ రెడ్డి తప్పులను సోషల్ మీడియా ఎత్తిచూపుతోంది.

ప్రజల గొంతు మీడియా మారుతోంది. రేవంత్ రెడ్డికి ముందుంది ముసళ్ళ పండగ ధాన్యం ప్రభుత్వానికి ఇస్తే డబ్బులు వస్తాయో రావో అని రైతులు భయపడుతున్నారు పాలనలో రేవంత్ రెడ్డి నైజం బయట పడింది. ఢిల్లీకి మూటలు పంపడంలో రేవంత్ రెడ్డి మంత్రులు పోటీ పడుతున్నారు.విద్యుత్ కమీషన్ చైర్మన్ మదన్ బీ లోకూర్ ఎప్పుడు పని చేశారో మాకు తెలియదు. విచారణ చేయకుండా నివేదిక ఎట్లా ఇస్తారు? విద్యుత్ కమీషన్ విచారణ పూర్తి చేసినట్లు ప్రభుత్వం అధికారికంగా చెప్పింది. మా వివరణ చైర్మన్ తీసుకోలేదు. కొన్ని మీడియా సంస్థలు మాపైన విషం కక్కుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఆరోపణలను మీడియా సంస్థలు ప్రచారం చేస్తున్నాయి. కమీషన్ వేస్తున్నట్లు సీఎం అసెంబ్లీలో ప్రకటించారు. కమిషన్ విచారణ పూర్తి అయితే అసెంబ్లీలో వివరాలు బయట పెట్టాలి.




కేసీఆర్ ముందు చిల్లరవేషాలు వేయలేరు. దొంగతనంగా ఎందుకు లీకులు ఇస్తున్నారు? మమ్మల్ని జైల్లో వేసే ఆలోచన వస్తే ఆలస్యం ఎందుకు? మమ్మల్ని జైల్లో పెట్టడానికి భయపడుతున్నారా? కాంగ్రెస్ ఏడాది పాలన చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. విద్యుత్ కమిషన్ రిపోర్ట్ ఇస్తే ప్రజల ముందు పెట్టు. కేసీఆర్ 24 గంటల కరెంటు ఇచ్చినందుకు జైల్లో పెడతారా? నివేదికలో ఏముండదని ముందే లీకులు ఇస్తున్నారు. కాంగ్రెస్ ఏడాది సంబరాల్లో రాహుల్ గాంధీ పోలీసులు లేకుండా అశోక్ నగర్ రైతుల వద్దకు రావాలి. ప్రభుత్వానికి ప్రజలు తిథి పెట్టడానికి రెడీగా ఉన్నారు. రాష్ట్రంలో ఒక్క వర్గం సంతోషంగా ఉందని రేవంత్ రెడ్డికి చెప్పే ధైర్యం ఉందా?

రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం 4వేల కోట్లు ఎందుకు తగ్గింది? కాంగ్రెస్ నేతలు అవినీతితో జేబులు నింపుకుంటున్నారు. పోలీసులను చూసి ప్రభుత్వం భయపడే స్థితికి వచ్చింది. ఏం చేశారని రేవంత్ రెడ్డి ఏడాది సంబురాలు చేసుకుంటారు? రేవంత్ రెడ్డికి సర్టిఫికేట్ ఇవ్వాల్సింది ప్రజలు. మూసీ శుద్దిని ప్రారంభం చేసింది బిఆర్ఎస్ పార్టీ. అసదుద్దీన్ ఒవైసీ గురించి ముస్లింలకు తెలుసు.



## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, నవంబర్ 3(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ శాసనసభ్యులు టి ప్రకాష్ గౌడ్ ఆదివారం సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.



రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో శంషాబాద్ మున్సిపల్, గొల్లపల్లికి చెందిన వెయిట్ లిఫ్టర్ మల్లికా రాఘవేందర్, నార్సింగ్ మున్సిపల్ వట్టినాగులపల్లికి చెందిన రెజ్లర్ ప్రతాప్ సింగ్ సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వెయిట్ లిఫ్టర్ మల్లికా రాఘవేందర్, రెజ్లర్ ప్రతాప్ సింగ్ నా నియోజకవర్గంలో ఉండడం చాలా గర్వకారణమన్నారు. రాష్ట్ర స్థాయిలో ఎన్నో విజయాలు, పతకాలు సాధించారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కి ప్రకాష్ గౌడ్ వివరించారు.

వారికి మెరుగైన అవకాశాలు కల్పిస్తే మన రాష్ట్రానికి ఎంతో పేరు ఇంకా ఎన్నో విజయాలు సాధిస్తారని తెలిపారు. అలాగే వారికి ఉపాధి అవకాశాలు కూడా కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరినట్లు తెలిపారు.

## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన నాట్కో ప్రతినిధులు

**నందిగామ, నవంబర్ 3 (నమస్తే ఉదయం):** నందిగామ మండలం మేక గూడ నాట్కో పరిశ్రమ హెచ్ ఆర్ మేనేజర్ సత్యనారాయణ, సాంబశివరావు లు షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం షాద్




ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు దీపావళి స్వీట్లు అందజేస్తున్న నాట్కో కంపెనీ ప్రతినిధులు

నగర్ పట్టణంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి స్వీట్ అందజేసి, దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పి. రఘు, జాండగూడెం సుదర్శన్ గౌడ్ ,మాజీ సర్పంచ్ బాలరాజు గౌడ్ తదితరులున్నారు.

## క్రీడలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయి..

### కరాటే క్రీడా శారీరక దారుఢ్యానికి ప్రతీక...

### - టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం


**కూకట్‌పల్లి, నవంబర్ 3 (నమస్తే ఉదయం):** కూకట్‌పల్లిలోని శ్రీ పుల్లూరి నారాయణదాస్ కల్యాణ మండపంలో జరిగిన 5వ నేషనల్ లెవల్ ఓపెన్ కరాటే, కుంగ్ ఫు, తాయిక్ వండ్ ఛాంపియన్ షిప్ 2024 కాంపిటిషన్ కార్యక్రమంలో కర్ణాటక, మహారాష్ట్ర, బెంగళూరు, ముంబాయి,




తెలంగాణలోని నాగర్ కర్నూల్, వరంగల్, పెద్ద పల్లి జిల్లాల నుండి 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నీయుద్ధ లీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు టి.సంతోష్ కుమార్ ఆహ్వానం మేరకు టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ఆటల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించి లక్ష్యం దిశగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం ప్రతిభ కనబరించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మేడల్స్, బహుమతులు సత్యం శ్రీరంగం చేతులమీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో షీ టీం లక్ష్మి, రుద్రమ దేవి, సెల్ఫ్‌డిఫెన్స్ అకాడమీ ఫౌండర్, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, రవి, శ్రీధర్, సత్య శంకర్ తదితర మాస్టర్లు, అకాడమీ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కురుమూర్తి స్వామి ఆలయ నూతన చైర్మన్ గోవర్ధన్ రెడ్డిని సన్మానించిన సీనియర్ నాయకులు మూలమల్ల భీంరెడ్డి

**కొత్తకోట, నవంబర్ 3(నమస్తే ఉదయం):** శ్రీ కురుమూర్తి రాయ దేవస్థాన నూతన కమిటీ చైర్మన్ జి. గోవర్ధన్ రెడ్డిని మాజీ మార్కెట్ చైర్మన్ మూలమల్ల రాజేశ్వరి భీమ్ రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆలయ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి,ఆలయ ఇ ఓ మదవెశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.







క్రీడా జెండాను ఎగురవేసి క్రీడల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్, క్రీడల పోటీలలో పాల్గొననున్న జట్లతో ఎమ్మెల్యే జీఎంఆర్

# విద్యార్థులకు క్రీడలతో భవిష్యత్తులో ఎంతో దోహదం: ఎమ్మెల్యే జీఎంఆర్

**దేవరకద్ర, నవంబర్ 3(నమస్తే ఉదయం):** విద్యార్థులు క్రీడలలో రాణించినప్పుడే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు అధిరోహిస్తారని దేవరకద్ర నియోజకవర్గం శాసనసభ్యులు జిఎంఆర్ అన్నారు. ఆదివారం దేవరకద్ర నియోజకవర్గం అడ్డాకుల మండలం రాచాల గ్రామంలో నిర్వహిస్తున్న 68 ఎస్ జి ఎఫ్ అండర్ 17 గర్ల్స్, అండర్ 19 బాయ్స్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై టోర్నీని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూధన్ రెడ్డి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్‌కి పలికిన క్రీడాకారులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలు కల్చరల్ ప్రోగ్రామ్స్ క్రీడాకారులు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ... ఉమ్మడి జిల్లాలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించక 19 ఏళ్ళు గడుస్తుందని, రాచాల గ్రామం అంటే నియోజకవర్గంలోనే క్రీడాలకు ప్రసిద్ధిగాంచిందని, గత ప్రభుత్వంలో ఇదే గ్రామానికి చెందిన క్రీడాల శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఉన్నప్పుడు ఈ గ్రామంలో క్రీడా పోటీలు నిర్వహించాలని క్రీడాభిమానులు విజ్ఞప్తి చేసిన పట్టించు కున్న దాఖలాలు లేవని పేర్కొన్నారు. కానీ తాము క్రీడాభిమానుల కోరికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, ఈ పోటీల కోసం పలు జిల్లాలు పోటీపడిన సీఎం రేవంత్ రెడ్డి దేవరకద్ర నియోజకవర్గంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారన్నారు. గత నెలలో స్పోర్ట్స్ డే సందర్భంగా తాను గచ్చిబౌలి స్టేడియంకు వెళ్ళినప్పుడు స్టేడియం కు మరమ్మత్తులు జరుగుతుంటే... అట్టి పనుల గురించి అరా తీస్తే గత ప్రభుత్వం గచ్చిబౌలి స్టేడియాన్ని క్రీడాలకు కాకుండా ఈవెంట్స్ కు వినియోగించేదాన్ని తెలిసిందన్నారు. గత ప్రభుత్వం క్రీడలను పూర్తిగా గాలికి వదిలేసిందని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత క్రీడాలకు ప్రాధాన్యమిస్తూ సీఎం రేవంత్ రెడ్డి 364 కోట్లు కేటాయించారని, జిల్లాకు స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పాలా ప్రణాళికలు సిద్ధం చేశారని, త్వరలో గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను వెలికి తీసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సీఎం కప్ నిర్వహించబోతున్నామని తెలిపారు. క్రీడా కారులు గెలుపోటములను హుందాగా స్వీకరించాలని, ఓటమి గెలుపుకు నాంది అని తెలిపారు.

ఇక్కడికి విచ్చేసిన క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశామని ఈ సందర్భంగా తెలియజేశారు.

అనంతరం టాస్ వేసి క్రీడా పోటీలను ప్రారంభించి, పోటీలను వీక్షించి, క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు.

# రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

### - దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్

**దేవరకద్ర, నవంబర్ 3(నమస్తే ఉదయం):** రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అని దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్ అన్నారు. ఆదివారం దేవరకద్ర నియోజకవర్గం చిన్న చింతకుంట మండలం పరిధిలోని దామగ్నపూర్, ఫర్దిపూర్ గ్రామాలలో కౌకుంట్ల మండలం ముచ్చిం తల గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులు, అధికారులతో కలసి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు.

అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ... రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో పడతాయన్నారు. ఈ సీజన్ నుండే సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తామని, ఏ వన్ గ్రేడ్ క్వింటాలుకు రూ. 2320, సన్న వడ్లకు రూ. 2820 మద్దతు ధరగా ఉంటుందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వం ప్రధాన ధ్యేయమని అన్నారు.

నాడు ప్రతిపక్షంలో కల్లాలకు కాంగ్రెస్ పేరుతో రైతుల కష్టాలను స్వయంగా చూసి,



రైతులెవరు ఇబ్బందులు పడవద్దనే ఉద్దేశంతో ముందస్తుగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని పేర్కొన్నారు, గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రైతుల నుండి తాలు, తరుగు పేరిట 5 నుండి 6 కిలోల ధాన్యాన్ని రైతుల నుండి దోచుకునేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, రైతుల బాధలు తెలిసిన ప్రభుత్వమని తెలిపారు.

గతంలో మాదిరిగా తాలు పేరుతో ధాన్యంలో కోతలు పెట్టొద్దని హెచ్చరించారు, ధాన్యం కొనుగోళ్లు పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని, గన్ని బ్యాగులు అవసరం ఉంటే ముందస్తు సమాచారం ఇవ్వాలని అధికారులను కోరారు, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావల్సిన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఈ సందర్భంగా జియంఆర్ పేర్కొన్నారు.

కౌకుంట్ల మండలం ముచ్చింతలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

## విద్యుత్ వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం: సీజీఎం పాండ్యా నాయక్

### విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి: విద్యుత్ సైబర్ సిటీ ఎస్ ఈ చంద్రశేఖర్

### విద్యుత్ స్తంభాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం పరిష్కరించండి: వినియోగదారులు

### విద్యుత్ స్తంభాలను తొలగించి ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకోవాలి...

**కూకట్‌పల్లి, నవంబర్ 3 (నమస్తే ఉదయం):** విద్యుత్ వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని టి జి ఎస్ పి డి సి ఎల్ ఆర్ జోన్ సిజిఎం పాండ్యా నాయక్ అన్నారు. ఆదివారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఎస్ఈ చంద్ర శేఖర్‌తో కలిసి ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా రోడ్లకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి వాహనదారులకు ట్రాఫిక్ జామ్ నుండి విముక్తి కలిగించాలని వివేకానంద నగర్ డివిజన్ రామకృష్ణ సంక్షేమ సంఘం అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా సిజిఎం పాండ్యా నాయక్ మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు నిరంతరం, నాణ్యమైన విద్యుత్ అందించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతుందని వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి సంస్థ అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద నగర్ డివిజన్ రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురంధర్ రెడ్డి విద్యుత్ సమస్యలపై వినతి పత్రం అధికారులకు అందజేశారు.

కాలనీలో మరి కొన్ని కేబుల్ వైర్లు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా రోడ్ల వెంబడి ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించి రోడ్లు సౌకర్యంగా ఉంటుందని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా ఉషా ముల్లపూడి రోడ్ లో రోడ్డుకి ఇరువైపులా విద్యుత్ స్తంభాలు రోడ్డుపైన ఉండటం వలన ప్రజలకు రాకపోకలకు తీవ్ర అంతరాయము ఏర్పడుతుందని, వెంటనే అధికారులను రోడ్డుపై ఉన్న విద్యుత్తు స్తంభాలను తొలగించి, కాలనీలో కేబుల్ వైర్లు ఏర్పాటు చేయవలసిందిగా అధికారులను కోరారు.




సిజిఎం పాండ్యా నాయక్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న వినియోగ దారుడు



బుద్వేల్ టీచర్స్ కాలనీలోని శ్రీ కట్టమైసమ్మ దేవాలయంలో శ్రీ చక్రాన్ని బహుకరిస్తున్న భక్తులు

## కట్టమైసమ్మ దేవాలయానికి "శ్రీ చక్రం" బహుకరించిన హరికిషన్ - కల్పన కుటుంబ సభ్యులు

**రాజేంద్రనగర్, నవంబరు 3(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ టీచర్స్ కాలనిలో కొలువై ఉన్న శ్రీ కట్టమైసమ్మ దేవాలయానికి భక్తులు శ్రీ చక్రాన్ని బహుకరించారు. స్థానిక భక్తులైన ఓగిరాల హరికిషన్ – కల్పన కుటుంబ సభ్యులు.శ్రీ చక్రానికి రూ. 16 వేలు ఖర్చు అయ్యిందని, అమ్మవారి దేవాలయానికి, శ్రీచక్రం బహుకరించడం, పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని అన్నారు. ఆదివారం ఉదయం దేవాలయ ప్రాంగణంలో కమిటీ సభ్యుల సమక్షంలో వేద పండితుల మంత్రోచ్చరానల మధ్య శ్రీ చక్రానికి, క్షీరాభిషేకం, కుంకుమార్చన, హారతులు, నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తాళ్లపాక సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో హరికిషన్– కల్పన కుటుంబ సభ్యులను ఘనంగా శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ పూజ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కోరని శ్యామ్, కోరని నరేందర్, టీచర్స్ సురేష్, కోరని బాలు, పోతురాజు రామకృష్ణ, పి.నర్సింహా, శివ, కృష్ణంరాజు, సుమిత్ర, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులందరిని

# తక్షణమే పర్మినెంట్ చేయాలి

**- ఏఐటియుసి మున్సిపల్ సంగం రాష్ట్ర అధ్యక్షులు కార్యదర్శులు కే రవిచందర్, వనంపల్లి జైపాల్ రెడ్డి**



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు జైపాల్ రెడ్డి

**మెట్‌పల్లి, నవంబర్ 3(నమస్తే ఉదయం):** జగిత్యాల జిల్లా మెట్ పల్లి మున్సిపాలిటీలో ఆదివారం మహాజన్ ఫంక్షన్ హాల్లో తెలంగాణ రాష్ట్ర స్టాఫ్ & ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఏఐటియుసి మహాసభ జరిగింది. ఈ మహాసభకు మున్సిపల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే రవి చంద్రన్, రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంట్రాక్ట్ , ఔట్ సోర్సింగ్ కార్మికులను తక్షణమే పర్మనెంట్ చేయాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మిక కుటుంబానికి 25 లక్షలు ఎక్స్రేషియా ఇవ్వానారు. కార్మిక కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులం దరినీ తక్షణమే పర్మనెంట్ చేయాలని కార్మికులకు తక్షణమే పిఆర్సి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లాలో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. కార్మికుల కోసం ఈఎస్ఐ డిస్పెన్సరీ ని ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే మున్సిపల్ కార్మికులందరికీ ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేయడం జరిగింది. అలాగే పదవి విరమణ పొందిన జీ.గంగమ్మ కు రాష్ట్ర నాయకులు సన్మానం చేయడం జరిగింది. అనంతరం మెట్‌పల్లి మున్సిపాలిటీ నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. 28మంది కౌన్సిల్‌సమితి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గౌరవ అధ్యక్షులు బి.మధురమ్మ , సలహాదారులు హుస్సేన్, అధ్యక్షులు బి.లక్ష్మణ్, కార్యనిర్వాక అధ్యక్షులు ఎల్ మహేష్ కుమార్, ఉపాధ్యక్షులుగా ఎల్ సంజీవ, డి.తిరుపతమ్మ, ప్రధాన కార్యదర్శి టి.నవీన్, సహాయ కార్యదర్శులుగా ఎల్.మహేష్, బి.నర్సయ్య, డి.లక్ష్మి, ఆర్గనైజర్ సెక్రెటరీలు యు.శ్రీను, జై.సాయిలు, కోశాధికారి ఎల్.శ్రీకాంత్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఆరుగురుని ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత ఎల్ శ్రీకాంత్ వహించారు. ఈ కమిటీని రాష్ట్ర నాయకత్వం ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్ర మోడీతోనే దేశ ప్రగతి

**- పాలమూరు పార్లమెంట్ కన్వీనర్ బిజెపి కన్వీనర్ పవన్ కుమార్ రెడ్డి**

**భారీ స్థాయిలో సభ్యత్వ నమోదును చేపడతాం : దేవరకద్ర బిజెపి ఇంచార్జ్ కొండా ప్రశాంత్ రెడ్డి**


పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతున్న పవన్ కుమార్ రెడ్డి

**కొత్తకోట, నవంబర్ 3(నమస్తే ఉదయం):** ప్రధాని నరేంద్ర మోడీతోనే దేశ ప్రగతి సాధ్యమవుతుందని పాలమూరు పార్లమెంట్ బిజెపి కన్వీనర్ డోకూరు పవన్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గం కొత్తకోట పట్టణ కేంద్రంలో మదనాపురం మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నవీన్ రెడ్డి సమక్షంలో జరిగిన కొత్తకోట పట్టణ, మదనాపురం మండలాల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మహబూబ్ నగర్ పార్లమెంటు కన్వీనర్ డొకూరు పవన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. దేవరకద్ర నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ కార్యక్రమం విస్తృతంగా చేపట్టి ఆదర్శంగా నిలవాలన్నారు. ప్రతి బూతులో 200కు పైగా సభ్యత్వాలు నమోదు చేయించాలని ఆయన సూచించారు.

ప్రతి కార్యకర్త 100కు పైగా సభ్యత్వాలు నమోదు చేయించిన కార్యకర్తకు క్రియాశీల సభ్యత్వం లభిస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో పోటి చేయడానికి మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమంలోకొత్తకోట సీనియర్ నాయకులు దాబా శ్రీనివాస్ రెడ్డి, వనపర్తి జిల్లా మాజీ అధ్యక్షులు రాజవర్ధన్ రెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ భరత్ భూషణ్, నాయకులు, సభ్యత్వ నమోదు ఇంచార్జ్ నారాయణరెడ్డి, మండల, గ్రామ బిజెపి పదాధి కారులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకున్న మదనాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్వరి భీమ్ రెడ్డి


శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకున్న రామకృష్ణాపురం గ్రామం స్వర్గీయ మాజీ పటేల్ వెంగల్ రెడ్డి కుటుంబ సభ్యులు

## శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకున్న రామకృష్ణాపురం గ్రామ స్వర్గీయ మాజీ పటేల్ వెంగల్ రెడ్డి కుటుంబ సభ్యులు

**కొత్తకోట,నవంబర్ 3(నమస్తే ఉదయం):** పేదల తిరుపతి కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా కార్తీక మాస ఆరంభ రోజున శ్రీ శ్రీ శ్రీ కురుమూర్తి రాయ స్వామిని దర్శించుకున్న మాజీ మార్కెట్ చైర్మన్ మూల్లమాల రాజేశ్వరి భీమ్ రెడ్డి కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు.

స్వామివారిని దర్శించుకున్న వారిలో మూలమల్ల సత్య నారాయణ రెడ్డి, నాగరాల లత రామేశ్వర్ రెడ్డి, రామ కృష్ణాపురం గ్రామం బిఆర్ఎస్ నాయకులు మూలమల్ల యుగంధర్ రెడ్డిలు పాల్గొన్నారు.


మాజీ మంత్రి సబితా రెడ్డితో సమావేశమైన బాబుల్ రెడ్డి నగర్ టిఆర్ఎస్ నాయకులు


బాబు రెడ్డి నగర్ నాయకులతో మాజీ మంత్రి సబితా రెడ్డి, యువ నేత కార్తీక్ రెడ్డి

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా రెడ్డిని కలిసిన

# బాబుల్ రెడ్డి నగర్ బిఆర్ఎస్ నాయకులు

**రాజేంద్రనగర్, నవంబర్ 3(నమస్తే ఉదయం):** మాజీ మంత్రి, మహేశ్వరం శాసనసభ్యురాలు పి సబితా ఇంద్రారెడ్డి, బి ఆర్ ఎస్ యువ నేత కార్తీక్ రెడ్డిని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్ బి ఆర్ ఎస్ నాయకులు దీపావళి పండుగ పురస్కరించుకుని మర్యాదపూర్వకంగా కలిసి శుభా కాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రా రెడ్డి మాట్లాడుతూ... రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ పటిష్టంగా ఉందని కార్యకర్తలు ధైర్యంగా ప్రజల పక్షాన నిలబడి అభివృద్ధి కోసం పోరాడాలని సూచించారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు బిఆర్ఎస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. ప్రజల కోసం నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కరించడం కోసం పని చేయాలన్నారు. దీపావళి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎస్ వెంకటేష్ మాజీ కౌన్సిలర్ ,రాము యాదవ్ ,సోమ శ్రీనివాస్ గుప్తా ,రాజేష్ యాదవ్, అరుణ్ ముదిరాజ్,అక్కెం రఘు యాదవ్ ,కొంపల్లి జగదీష్ ,సోమ సందీప్ గుప్తా, రవి ముదిరాజ్, కార్తీక్ ముదిరాజ్ ,ఈశ్వర్, వెంకటేష్, భాస్కర్, మహేష్ ,ఋషి ,కోట్ల ఉమా, సరస్వతి ,కోట్ల కల్పన కురువ పెంటమ్మ ,చంద్రకళ, బిఆర్ఎస్ నాయకులు ,కార్య కర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# అన్నీ మతాల సారాంశం ఒక్కటే

**- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**


దర్గాపై చద్దర్‌ను సమర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్‌పల్లి, నవంబర్ 3 (నమస్తే ఉదయం):** హైదర్ నగర్ గ్రామ పరిధిలోని దర్గా వద్ద ముస్లిం మైనార్టీ ప్రజలు పెద్దయెత్తున నిర్వహించిన గ్యార్వీ వేడుకల్లో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పర్థనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోని అన్నీ మతాలు, కులాలు ఒక్కటే అనే విషయాన్ని గుర్తించి మత సామరస్యంతో అందరూ ముందుకు వెళ్లాలని అన్నారు. అన్నీ మతాల సారం ఒక్కటేనని, ఒకరికి ఒకరూ ప్రేమా ఆప్యాయతలతో సహాయపడుతూ దేశాన్ని ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. హైదర్ నగర్ ప్రాంతం తనకు రాజకీయంగా పుట్టినిల్లు వంటిదన్నారు. ప్రజా ప్రతినిధిగా మొదటి ప్రస్థానం హైదర్ నగర్ లో మొదలయ్యిందని అప్పటి నుంచి వెనుదిరిగి చూడకుండా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందటం జరిగిందన్నారు. తనను కౌన్సిలర్‌గా గెలిపించిన హైదర్ నగర్ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషిచేసినట్లు తెలిపారు. శ్మశాన వాటికలకు, పాఠశాలలకు, ప్రార్థన స్థలాల కోసం భూములను ఆరోజుల్లోనే ఇప్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్ రావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, మొహమ్మద్ గౌసుద్దీన్, గొట్టిముక్కల బాస్కర్ రావు, స్థానిక నాయకులు కలీమ్, నక్క శ్రీనివాస్, న్యాయవాది శ్రీకాంత్, నర్సింగరావు, వెంకటేష్, సలీమ్, మహిళ నాయకురాలు జుబేదా బేగం, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## జాతరకు వచ్చే భక్తులకు సంపూర్ణ ఏర్పాట్లు చేపట్టండి: ఎమ్మెల్యే జీఎంఆర్


శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**చిన్న చింతకుంట,నవంబర్ 3(నమస్తే ఉదయం):** పేదల దేవుడిగా పేరుందిన శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్స వాల సందర్భంగా జాతరకు వచ్చే భక్తులకు అధికారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జీఎంఆర్ సూచించారు. ఆదివారం చిన్న చింతకుంట మండలంలోని శ్రీ.శ్రీ.శ్రీ కురు మూర్తిస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జాతరలో విస్తృతంగా పర్యటించి జరుగుతున్న ఏర్పాటులను ఈవో మదవెశ్వర్ రెడ్డి, చైర్మన్ గోవర్ధన్ రెడ్డి తో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... ఈ ప్రాంత భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, ఆలయ ఇ ఓ మదవెశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## మహేశ్వరం నియోజకవర్గంలో

# అభివృద్ధి పనులు చేపట్టాలి

**సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి**

**అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయాలి**

మహేశ్వరం కాంగ్రెస్ ఇంచార్జ్ కెఎల్ఆర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సిపి ఎం నాయకులు


**బాలాపూర్, నవంబర్ 3(నమస్తే ఉదయం):** భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి ఆధ్వర్యంలో సిపిఐ బాలాపూర్ మండల పార్టీ నేతలు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి ని కలిసి సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి మాట్లాడుతూ... మహేశ్వరం నియోజకవర్గంలో పారిశుద్ధ్యం, రోడ్లు, పచ్చదనం పరిశుభ్రత, కరెంటు, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలతో పాటు వివిధ ప్రాజెక్టులతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా ప్రజల సమస్యలు తీర్చే విధంగా అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను మహేశ్వరం నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా కృషి చేయాలన్నారు. నియోజక వర్గ అభివృద్ధి కోసం మరిన్ని నిధులు ప్రత్యేకంగా ప్రభుత్వంతో మాట్లాడి విడుదల చేయించాలని పగడ్బందీగా అవినీతికి తావు లేకుండా అర్హులైన వారిని గుర్తించి ఇల్లు లేని వారికి ఇండ్లు , ఇండ్ల స్థలాలు, పింఛన్లు అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అలాగే సబ్సిడీ లోన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ కిచెన్న గారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... మీ విజ్ఞప్తిని పరిశీలిస్తామని నియోజకవర్గం అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలు అర్హులైన వారందరినీ గుర్తించి వారికి ప్రభుత్వ పథ కాలను అందే విధంగా కృషి చేస్తానన్నారు. మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధి కోసం కట్టు బడి ఉన్నామని పేదలకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామని, పార్టీలకతీతంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందంగారి చంద్రశేఖర్ రెడ్డి, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జర్పుల శివ నాయక్, మహిళా సమాఖ్య జిల్లా సహాయ కార్య దర్శి బండ యాదమ్మ యాదవ్, లెనిన్‌నగర్ సిపిఐ పార్టీ శాఖ కార్యదర్శి పిచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.


## ప్రగతినగర్‌లో జరిగే సీపీఎం పార్టీ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా మహాసభలను జయప్రదం చెయ్యండి




**- జిల్లా కార్యదర్శి పి.సత్యం**

**కూకట్‌పల్లి, నవంబర్ 3 (నమస్తే ఉదయం):** బాలానగర్ లో సిపిఎం పార్టీ కార్యాలయంలో సీపీఎం పార్టీ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా 3వ మహాసభలను జయప్రదం చెయ్యాలని సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి పి.సత్యం పాల్గొని మాట్లాడుతూ జిల్లా మహాసభలను జయప్రదం చెయ్యడంలో కూకట్‌పల్లి నియోజ వర్గం, కుత్బుల్లాపూర్ నియోకవర్గాల ప్రజల సహకారం అందించాలని కోరారు. గత 3 సంవత్సరాలలో జరిగిన పోరాటాలు భవి ష్యత్‌లో జరిపే పోరాటాల తీర్మానాలను ఆమోదిస్తుందని, దేశంలో, రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలకు అవలంభిస్తున్నాయి అని అన్నారు. ముఖ్యంగా మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 5 నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రతి నియోజవర్గం లో 100పడకల ప్రభుత్వ హాస్పిటల్ లను ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా మేడ్చల్ జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఏర్పాట్లు చెయ్యాలి. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీలను వెంటనే అమలు చెయ్యాలని, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కృష్ణ రావు, జిల్లా కమిటి సభ్యులు వెంకట్ రామయ్య, ఐలాపురం రాజశేఖర్, కీలుకాని లక్ష్మణ్, ఎం. శంకర్, ఎం. నరేష్, జిల్లా నాయకులు లింగస్వామి, ఏ. విజయ, శివ ప్రసాద్, పి. శంకర్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## యాక్షన్ థ్రిల్లర్ "కిల్లర్" జ్యోతి పూర్వజ్



పలు సూపర్ హిట్ సీరియల్స్, సినిమాల్లో నటించి పాన్ ఇండియా వీక్షకుల ఆదరణ పొందడంతో పాటు సోషల్ మీడియాలో ఎంతో క్రేజ్ తెచ్చుకున్న హీరోయిన్ జ్యోతి పూర్వజ్. ఆమె ప్రధాన పాత్రలో "శుక్ర", "మాటరాని మౌనమిది", "ఏ మాస్టర్ పీస్" వంటి డిఫరెంట్ సినిమాలతో మూవీ లవర్స్ దృష్టిని ఆకట్టుకుంటున్న దర్శకుడు పూర్వాజ్ "కిల్లర్" అనే సెన్సేషనల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీని రూపొందిస్తున్నారు.

ఏయు అండ్ఐ మరియు మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థతో కలిసి థింక్ సినిమా బ్యానర్ పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు పూర్వాజ్ ప్రజయ్ కామత్, ఎ. పద్మనాభరెడ్డి ఈ కొలాబ్రేషన్ లో నిర్మాణమవుతున్న రెండవ చిత్రమిది. పూర్వాజ్ "కిల్లర్" చిత్రంలో ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ రోజు "కిల్లర్" పార్ట్ 1 డ్రీమ్ గర్ల్ మూవీ నుంచి జ్యోతి పూర్వజ్ క్యారెక్టర్ ఫస్ట్ లుక్ తో పాటు మోషన్ పోస్టర్ రిలీజ్ చేశారు."కిల్లర్" మూవీ మోషన్ పోస్టర్ ఎలా ఉందో చూస్తే – చేతిలో గొడ్డలి పట్టుకున్న పవర్ ఫుల్ వుమెన్ రోబోను పరిచయం చేశారు. ఆ రోబో జ్యోతి పూర్వజ్ క్యారెక్టర్‌గా మారడం ఆసక్తికరంగా ఉంది.

జ్యోతి పూర్వజ్ క్యారెక్టర్ లుక్ లో ఆమె ఒక భుజానికి వెజిటేబుల్స్ బ్యాగ్, మరో చేతిలో గొడ్డలి పట్టుకుని ఉంది.



## 'లక్కీ భాస్కర్' చూసి దర్శకుడు వెంకీ అట్లూరిపై గౌరవం పెరిగింది : ప్రముఖ నిర్మాత దిల్ రాజు

వైవిధ్యభరితమైన చిత్రాలు, పాత్రలతో దేశవ్యాప్తంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ తెలుగులో హ్యాట్రిక్ విజయాన్ని సాధించారు. 'మహానటి', 'సీతారామం' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత దుల్కర్ సల్మాన్ తెలుగులో నటించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రతిభగల దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మీనాక్షి చౌదరి కథానాయిక. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీత దర్శకుడు. దీపావళి కానుకగా అక్టోబర్ 31వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదలైంది. ఈ సినిమా పట్ల ఎంతో నమ్మకంగా ఉన్న నిర్మాతలు, అక్టోబర్ 30వ తేదీ సాయంత్రం నుంచే ప్రీమియర్ షోలు ప్రదర్శించారు. నిర్మాతల నమ్మకం నిజమై మొదటి షో నుంచే ఈ సినిమాకి పాజిటివ్ టాక్ లభించింది. రోజు రోజుకి వసూళ్లను పెంచుకుంటూ సంచలన విజయం దిశగా దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించింది. చిత్ర బృందంతో పాటు ప్రముఖ నిర్మాత దిల్ రాజు, ప్రముఖ దర్శకులు నాగ్ అశ్విన్, హను రాఘవపూడి తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

ప్రముఖ నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ, "ముందుగా నాగవంశీకి శుభాకాంక్షలు. ఒకప్పుడు నన్ను నేను ఇప్పుడు వంశీలో వెతుక్కుంటున్నాను. లక్కీ భాస్కర్ సినిమా చూసిన తర్వాత నాకు దర్శకుడు వెంకీ అట్లూరిపై చాలా గౌరవం పెరిగింది. ప్రేమ కథలతో దర్శకుడిగా తన ప్రయాణాన్ని మొదలుపెట్టిన వెంకీ, సార్ సినిమా నుంచి రూట్ మార్చాడు. ఈ సినిమాలో తను రాసిన డైలాగ్ లకు, క్యారెక్టర్లను హ్యాండిల్ చేసిన విధానానికి హ్యాట్సాఫ్. దుల్కర్ గారి నటన గురించి ప్రత్యేకంగా చెప్పేదేముంది. తెలుగులో మూడు సినిమాలు మూడు క్లాసిక్స్. జి.వి. ప్రకాష్ మంచి సంగీతం అందించారు. హీరోయిన్ మీనాక్షి చౌదరి కూడా చక్కగా నటించింది. టీం అందరూ కష్టపడి ఒక క్లాసిక్ సినిమాను ఇచ్చారు. నేను ఒకప్పుడు చిన్న, మీడియం రేంజ్ సినిమాలు కూడా చేస్తూ ఘన విజయాలు సాధించాను. ఇప్పుడు వంశీ అది మెయింటైన్ చేస్తున్నాడు. అందుకే వంశీలో నన్ను నేను వెతుక్కుంటున్నాను అని చెప్పాను" అన్నారు.

## ఎవరూ ఉచితంగా చేయరు

### –నోరాఫతేహి




బాహుబలిలో మనోహరి గీతంలో నర్తించిన నోరా ఫతేహికి ఇటు తెలుగులోను భారీ ఫాలోయింగ్ ఏర్పడింది. అద్భుతమైన డ్యాన్సింగ్ ప్రతిభతో మతులు చెడగొట్టిన ఈ బ్యూటీ హిందీ డ్యాన్స్ రియాలిటీ షోలలో జడ్జిగా అదరగొడుతూ భారీగా ఆర్జిస్తోంది. మొరాకో నుంచి ముంబైకి ప్రయాణమైన ఈ బ్యూటీ అంతకుముందు కుటుంబ పోషణ కోసం చాలా ఉద్యోగాలు చేసింది. చివరికి షాపింగ్ మాల్ లో కూడా పని చేసానని తెలిపింది. నోరా ఫతేహి ఇటీవల బాలీవుడ్‌లో తన కఠినమైన ప్రయాణం గురించి ఓపెన్‌గా మాట్లాడింది. మెల్‌బోర్న్‌లోని ఐఎఫ్ఎఫ్ఎమ్‌లో రాజీవ్ మసంద్‌తో జరిగిన చిట్ చాట్ లో నోరా చెప్పిన సంగతులు అవాక్కయ్యేలా చేసాయి. సినీపరిశ్రమలో ప్రవేశించినప్పుడు కొత్త వ్యక్తిగా తాను అనేక క్లిష్ట పరిస్థితులను ఎలా ఎదుర్కొందో కూడా తెలిపింది. నోరా తనకు సహాయం చేయగలరని భావించిన వ్యక్తులను కలుసుకుంది. కానీ వారిలో హిడెన్ ఉద్దేశ్యాలు వేరుగా ఉన్నాయి. కొందరు ఆమెను పెద్ద ప్రొడక్షన్ హౌస్‌లతో కనెక్ట్ చేస్తామని వాగ్దానం చేశారు. అయితే ఇది భయానక పరిస్థితులకు దారితీసింది. ఇది క్రేజీ లీక్ అప్పటికి నోరాకు కేవలం 22 సంవత్సరాలు. కెనడా నుండి భారతదేశానికి అప్పుడే కొత్తగా వచ్చింది. అయితే ఇక్కడ అవకాశాల కోసం ప్రయత్నించే క్రమంలో కొందరు తప్పుడు వ్యక్తులను నమ్మేసిందట. వారంతా మంచి ఉద్దేశాలను కలిగి ఉన్నారని భావించినట్టు నోరా చెప్పింది. ఇప్పుడు నేను మీతో ఎందుకు వస్తున్నాను? నా నుండి నీకు ఏమి కావాలి? ... అంటే.. స్పష్టంగా.. ఎవరూ ఉచితంగా ఏమీ చేయరు.. ఏదో ఒకటి ఆశిస్తారు. కానీ ఆ సమయంలో – దేవుడు ఈ వ్యక్తిని నా దగ్గరకు పంపారు అనుకుని నేను చాలా మంది ఇడియట్‌లను అనుసరించాను! – అని చెప్పింది. – ఈ వ్యక్తులు ఆమెను సరైన వ్యక్తులకు పరిచయం చేసినా కానీ.. వారిలో కొందరు ప్రతిఫలంగా ఏదైనా కావాలని ఆశించారు. అది అసురక్షితంగా అనిపించింది..– అని నోరా తెలిపింది. – ఇది నన్ను నిజంగా భయానక పరిస్థితులలోకి నెట్టింది. చివరికి ఆ వ్యక్తి – చెయ్యండి.. దీని నుండి నాకేమీ రాదు– అని అనేవారు. ఇది నిజంగా విచిత్రమైనది ! అని నోరా గతానుభవాలను గుర్తుచేసుకుంది. నోరా చివరికి నిరాశ పడకుండా ఉండటం నేర్చుకుంది. ఎందుకంటే దీనివల్ల ఇబ్బంది ఎదురవుతుంది తప్ప ప్రయోజనం ఉండదు. నిరాశ చెందక తాను నటనకు సిద్ధంగా ఉన్నానని బలంగా అనుకునేదట. అయితే చదువుకోవడానికి ఇంటికి తిరిగి వెళ్లిపోవాలని కూడా సిద్ధమైంది. కానీ పరిస్థితులు తనను తాను సరిదిద్దుకునేందుకు సహకరించాయని తెలిపింది. అయితే పరిశ్రమలో తాను ఎదుర్కొన్న తిరస్కరణ అనుభవాలు మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపాయి. దానిని భరించేందుకు చికిత్స కోసం నిపుణుడిని ఆశ్రయించింది. మరో కత్రినా కైఫ్ అవ్వాలనుకుంటున్నావా? అని కొందరు ప్రశ్నించినట్టు కూడా గుర్తు చేసుకుంది నోరా.



## తెలుగులో కవిన్ బ్లడీ బెగ్గర్

కోలీవుడ్ టాలెంటెడ్ నటుడు కవిన్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న తాజా చిత్రం బ్లడీ బెగ్గర్ ఈ సినిమాను శివ బాలన్ ముత్తుకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు స్టార్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ నిర్మాణ బాధ్యతలను తీసుకోగా ఫిలమెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ ప్రాజెక్ట్ నిర్మితమవుతోంది దీపావళి పండుగకు తమిళ్ వెర్షన్ థియేటర్లలో విడుదలై మంచి మౌత్ టాక్ సొంతం చేసుకుంది. ఇప్పుడు తెలుగు వెర్షన్ విడుదల తేదీ కూడా ఖరారైంది తెలుగులో బ్లడీ బెగ్గర్ చిత్రం నవంబర్ 7న విడుదల కానుంది. ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులకు ఏసియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్‌పీ ద్వారా అందించనున్నారు. ఇదివరకు విడుదలైన ఈ సినిమా పోస్టర్స్, ఫస్ట్ పీక్ పేరుతో విడుదలైన టీజర్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది జెన్ మార్టిన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా ఈ ప్రాజెక్ట్ నెల్సన్ దిలీప్‌కుమార్ తొలి ప్రొడక్షన్ వెంచర్ కావడం మరో విశేషం బ్లడీ బెగ్గర్.



## బాలయ్య క్లైమాక్స్

టాలీవుడ్ సీనియర్ హీరో నందమూరి బాలకృష్ణ.. ప్రస్తుతం ఎన్.బి.కె. 109 మూవీతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. రీసెంట్‌గా అఖండ-2 పూజా కార్యక్రమాలు జరగ్గా.. ఇప్పుడు ఎన్.బి.కె. 109 సినిమాను పూర్తి చేసే పనిలో ఉన్నారు బాలయ్య. పక్కా మాస్ ఎంటర్టైనర్‌గా చిత్రాన్ని బాబీ తెరకెక్కిస్తున్నారు. ఇప్పటి వరకు ఎన్నడూ చూడని రీతిలో బాలయ్యను వైలెంట్‌గా చూపిస్తానని బాబీ ఇప్పటికే పలుమార్లు తెలిపారు. అయితే కొద్దిరోజుల క్రితం విడుదలైన గ్లింప్స్.. మంచి రెస్పాన్స్ అందుకుంది. అందులో బాలయ్యను ఓ రేంజ్ లో చూపించారు మేకర్స్. దీంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానున్న ఎన్.బి.కె. 109 మూవీకి డాకు మహారాజ్, వీర మాస్, సర్కార్ సీతారాంలో ఏదో ఒక టైటిల్ ఫిక్స్ చేశారని కొద్ది రోజులుగా వార్తలు వస్తున్నాయి. దీపావళికి అనౌన్స్మెంట్ వస్తుందని అంతా అనుకోగా.. రాలేదు. దీపావళి పండగకు టైటిల్‌ను విజువల్స్‌తో సహా రూపొం దించి అనౌన్స్ చేద్దామనుకున్నామని, సీజీ వర్క్ అవ్వలేకపోవడం వల్ల ఇవ్వలేకపోతున్నామని ఎన్.బి.కె. 109 నిర్మాత నాగ వంశీ రీసెంట్ గా తెలిపారు. నవంబర్ రెండో వారంలో అప్డేట్ ఇస్తామని చెప్పారు. దీంతో అంతా అప్డేట్ కోసం వెయిట్ చేస్తున్నారు. అదే సమయంలో ఇప్పుడు కొత్త అప్డేట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. సినిమా క్లైమాక్స్ ను షూట్ చేయడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారని టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో యాక్షన్ సీక్వెన్స్ ను షూట్ చేస్తున్న మేకర్స్.. కొత్త షెడ్యూల్‌లో క్లైమాక్స్ ను చిత్రీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అందుకు బాలయ్య కూడా పవర్ ఫుల్ గా సిద్ధం అవుతున్నారని వార్తలు వస్తున్నాయి. నెవ్వర్ బిఫోర్ అనేలా క్లైమాక్స్ ను మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆ షూట్ అయ్యాక.. బాలయ్య తన డబ్బింగ్ పార్ట్‌ను పూర్తి చేయనున్నట్లు టాక్.

**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733